ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
రంజాన్ వేళలు | ఇఫ్తార్: 6.31 | సహర్: 5.03 (గురువారం)
**



సూర్యాపేట
5
బుధవారం 13 మార్చి 2024

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442
యాదాద్రి : 1800 425 7106
సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.136	197	224
సూర్యాపేట	రూ.130	200	230
నల్లగొండ	రూ.136	200	230

ఉష్ణోగ్రత గరిష్ఠం 36.0 । కనిష్ఠం 23.4

కరువు తరుముతోంది

జిల్లాలో ప్రమాదఘంటికలు మోగుతున్నాయి. రోజురోజుకు పడిపోతున్న భూగర్భజలాలు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. సరిపడా వర్షాల్లేక ప్రాజెక్ట్‌ల్లో నీటి నిల్వలు అడుగంటిపోవడంతో కాల్వలు ఒట్టిపోయాయి. ఇప్పటికే వందలాది ఎకరాల్లో పంటలు ఎండిపోగా.., ఉన్న పంటను పశువుల మేతగా వినియోగిస్తున్నారు. ఇన్నాళ్లు కంటికి రెప్పలా కాపాడుకున్న పంట పొలాలు ఎండిపోతుంటే గుండె తల్లడిల్లిపోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి, సూర్యాపేట)



పెన్‌పహాడ్ మండలం గూడెపుకుంట తండలో ఎండిన పంట

- అడుగంటుతున్న రైతన్నల ఆశలు
- జిల్లావ్యాప్తంగా మోగుతున్న ప్రమాద ఘంటికలు
- మీటర్ల లోతుకు పడిపోయిన భూగర్భజలాలు
- ఒట్టిపోయిన కాల్వలు
- ఎండుతున్న పంటపొలాలు
- దిక్కుతోచని స్థితిలో రైతన్నలు
- ఆయకట్టు పరిధిలో నీటిని విడుదల చేయాలని వేడుకోలు

జిల్లాలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టులైన నాగార్జున సాగర్, మూసీ, ఎస్సారెస్పీ కాల్వల కింద ఎక్కువ విస్తీర్ణంలో వరిసాగు చేశారు. ప్రస్తుత యాసంగిలో జిల్లాలో వరి 2,06,263 ఎకరాల్లో సాగుచేయగా, గత సంవత్సరం యాసంగిలో 3,85,459 ఎకరాల్లో సాగైంది. గత ఏడాదితో పోలిస్తే ఈ సారి యాసంగిలో 1,25,196 ఎకరాలు తక్కువగా సాగు చేశారు. ప్రధానంగా సాగునీటి ప్రాజెక్టుల్లో నీరు లేకపోవడంతో సాగు తక్కువైంది. ప్రస్తుతం వివిధ ప్రాజెక్టుల కింద సాగు చేసిన వరి పొలాలు ఎండిపోతున్నాయి. నాగార్జునసాగర్ ఎడమ కాల్వ కింద, శ్రీరాంసాగర్ రెండో దశ కింద పొట్టదశకు చేరిన వరి పంట సుమారు 50వేల ఎకరాల్లో ఎండిపోయే దశకు చేరింది. నాగార్జునసాగర్ ఎడమ కాల్వ ఆయకట్టులో 91,593 ఎకరాల్లో, ఎస్సారెస్పీ ఆయకట్టు కింద 13,175 ఎకరాలు, మూసీ ఆయకట్టు కింద 12,380 ఎకరాలు సాగయ్యాయి. ప్రాజెక్టుల కింద 1,17,148 ఎకరాలు సాగయ్యాయి. బోర్లు, బావుల కింద 89,115 ఎకరాలు సాగుచేస్తున్నారు.

పడిపోయిన భూగర్భజలాలు

ఈసారి సాధారణ వర్షపాతంకంటే 36 శాతం తక్కువ వర్షం కురిసింది. గత ఏడాది మార్చిలో 7.23 మీటర్లలో లభించిన భూగర్భజలాలు ఈసారి 12.38 లోతున లభిస్తున్నాయి. జిల్లాలో సాగునీరే కాకుండా తాగునీటికి కూడా ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి నెలకొంది.

నీటి నిల్వలు లేక

జిల్లాలో ఎస్సారెస్పీ కాల్వలు తిరుమలగిరి మండలం వెలిశాల నుంచి ప్రారంభమవుతాయి. అక్కడికి జనగాం జిల్లా కొడకండ్ల బయ్యన్నవాగుకు, అక్కడికి మహబూబాబాద్ జిల్లా మైలవరం రిజర్వాయర్ నుంచి నీటి రాక వస్తుంది. అయితే మైలవరం రిజర్వాయర్‌కు నీటిని అందించి లోయర్ మానేరు, అంతకుముందుండే మిడ్ మానేరుకు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి నీటి రాక లేదు. దీంతో ఉన్న కొద్దిపాటి నీటిని కాల్వలకు విడుదల చేస్తున్నారు. ఈక్రమంలో ఎస్సారెస్పీ పరిధిలోని చివరి ఆయకట్టుకు నీరందడం గగనంలా మారింది. ప్రధానంగా జిల్లాలోని వెలిశాల చెరువుకు నీరందించే బయ్యన్నవాగు నీటి సామర్థ్యం 0.48 టీఎంసీలు కాగా ప్రస్తుతం 0.38 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. అయితే నీటి నిల్వ తక్కువగా ఉండటంతో తక్కువ ఒత్తిడి వల్ల నీటి ప్రవాహ వేగం తగ్గి చివరి భూములకు నీరందడం లేదు. జిల్లాలోని డీబీఎం 69, 70, 71కాల్వల ద్వారా సాగునీటిని విడుదల చేస్తున్నారు. డీబీఎం 69ద్వారా తుంగతుర్తి, నూతనకల్, మద్దిరాల మండలాల్లోని 170 చెరువులకు నీటిని విడుదల చేస్తున్నా అంతంత మాత్రంగానే అందుతోంది.

ఎండుతున్న పంటలు

ఎస్సారెస్పీ పరిధిలోని అర్వపల్లి, మద్దిరాల నూతనకల్, ఆత్మకూర్(ఎస్), పెన్‌పహాడ్ మండలాల్లో పొలాలు ఎండిపోతున్నాయి. సాగునీటిని విడుదల చేయాలని ఆత్మకూర్(ఎస్) మండలం కోటపహాడ్ గ్రామస్థులు ఈ నెల 1వతేదీన రాస్తారోకోతో పాటు కలెక్టరేట్ ముట్టడిని నిర్వహించారు. మూడేళ్లుగా వారబందీ పద్ధతిలో కాల్వలకు ప్రతి రోజూ 1600 క్యూసెక్కుల నీటిని మాత్రమే విడుదల చేస్తున్నారు. దీంతో కేవలం మోకాళ్లోతు నీరు మాత్రమే ప్రవహిస్తోంది. చివరి భూములకు నీరు అందకపోవడంతో వరి సాగు చేసిన పంటలు ఎండిపోతుండటంతో కొన్నిచోట్ల పశువులకు మేతగా ఉపయోగిస్తున్నారు.

40 రోజుల్లో నాలుగు టీఎంసీల నీరే

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ ద్వారా గోదావరి జలాలను రెండోదశ ఆయకట్టు కింద ఉన్న కాల్వలకు 40రోజుల్లో వారబందీ పద్ధతిలో 4.05 టీఎంసీల నీటిని మాత్రమే విడుదల చేశారు. 69 డీబీఎంకు 650క్యూసెక్కులు, 70, 71డీబీఎంకు 1150క్యూసెక్కుల నీటి విడుదల మాత్రమే చేస్తుండటంతో పొలాలు ఎండిపోతున్నాయి. రబీ సీజన్‌లో సుమారు 80వేల ఎకరాలల్లో వరి సాగు చేశారు. సుమారు 50 వేల ఎకరాలకు సాగునీరందడం లేదు.



ఎడమకాల్వపై నడిగూడెం వద్ద కూలిన ఎల్-34 లిఫ్ట్ బావి

సగానికి తగ్గిన సాగు

నడిగూడెం: సాగర్ ఎడమకాల్వ ఆయకట్టులో అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నాయి. నీటి విడుదల లేకపోవడంతో సాగు సగానికి పడిపోయింది. 10 ఎకరాల రైతు ఐదు ఎకరాలు, ఐదు ఎకరాల రైతు రెండు, మూడు ఎకరాల్లోనే పంటలు సాగు చేశారు. ప్రస్తుతం పొట్టదశలో ఉన్న పంట పొలాలకు సాగర్ నీరందితేనే ఉన్న కాస్త పంట చేతికందుతుందనే ఆశతో ఉన్నారు. ఎడమ కాల్వ నీటి విడుదల విషయంలో ప్రభుత్వం నుంచి స్పష్టత లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎడమకాల్వ ద్వారా నీరందించి ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

పొలం ఎండిపోతోంది



శ్రీరాంసాగర్ నీటి కోసం గంపెడు ఆశతో వరి సాగుచేశాం. వారబందీతో పొలాలు ఎండిపోయాయి. వేసిన పంట చేతికి వస్తుందని అనుకున్నాం. తీరా సమయానికి సాగునీరందక పొలం ఎండింది.

- వెంకన్న, రైతు, సీతారాంపురం గ్రామం అర్వపల్లి

పశువులను మేపుతున్నాం



ఎండిన పొలాల్లో పశువులను మేపుతున్నాం. నీరు సకాలంలో విడుదల కాకపోవడంతో పొట్ట దశలో ఉన్న పొలాలు ఎండిపోతున్నాయి. పొలాల కోసం పెట్టుబడి పెట్టి అప్పులపాలయ్యాం. ఎండలు తీవ్రంగా ఉన్నాయి. తడి ఆరిపోతున్నాయి.

- కేలోతు రవి, రైతు, లోయపల్లి అర్వపల్లి మండలం

రెండు రోజుల్లో నీరు విడుదల చేయకుంటే..



కోదాడ రూరల్: సాగర్ ఎడమ కాల్వకు నీటి విడుదల చేయకపోతే మండలంలోని వందలాది ఎకరాల్లో వరిపంట ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎడమకాల్వ కింద ఈ సంవత్సరం నీటి విడుదల చేయకపోయినా బావులు, బోర్లు, చెరువుల కింద వానాకాల, యాసంగిలో రైతులు వరి సాగుచేశారు. తాగునీటి అవసరాలకోసం సాగర్‌కాల్వకు అప్పుడప్పుడు వదిలిన నీటితో ఖరీఫ్ పంటలను గట్టెక్కించుకున్నారు. రబీలో మాత్రం రైతులు సాగుచేసిన పంటలు ఎండిపోయే ప్రమాదం ఏర్పడడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే దోరకుంట, కాపుగల్లు, రెడ్లకుంట, నల్లబండగూడెం, తమ్మర, తొగ్రాయి, గణపవరం, రామలక్ష్మీపురం, యర్రవరం గ్రామాల్లో వేసిన వరిపంట నీరులేక ఎండిపోవడంతో రైతులు పశువులను మేపుతున్నారు.

నీరులేక ఎండుతున్న వరి పొలాలు

మఠంపల్లి: సకాలంలో సాగునీరు అందక మండలంలో వరిపొలాలు ఎండిపోతున్నాయి. మండలంలోని యాతవాకిళ్ల, చౌటపల్లి, అల్లీపురం, వర్ధాపురం, మంచ్యా తండాల రైతుల పంటలు ఎండిపోతుండడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆయా గ్రామాల్లోని చెరువులు, కుంటలు పూర్తిగా ఎండిపోడం, బావులు, బోర్లలో భూగర్భజలాలు అడుగంటడంతో ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఆయా గ్రామాల్లో సుమారు 500 ఎకరాలు ఉంటుందని, ఇప్పటికే సుమారు 100 ఎకరాలు ఎండిపోయే దశకు చేరిందని రైతులు పేర్కొంటున్నారు. గత్యంతరం లేక వరిపంటను పశువులకు మేతకు వదిలేశారు.




మఠంపల్లిలో వరి పొలంలో పశువులను మేపుతున్న రైతు

తూము తీసి..

ఆత్మకూర్(ఎస్): అసలే ఎండలు.. ఆపై నీటి కొరత.. వ్యవసాయానికే కాదు.. తాగునీటికి సైతం నీటికి కటకట ఏర్పడింది. మూలిగే నక్కపై తాటిపండు పడిన చందంగా ఒకవైపు నీటి సమస్యలతో రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతుండగా చెరువులో ఉన్న కొద్దిపాటి నీటిని తూము ద్వారా తరలిస్తున్న ఘటన మండల పరిధిలోని ముక్కుడు దేవులపల్లిలో చోటు చేసుకుంది. ఊరచెరువు తూము నుంచి గుర్తుతెలియని వ్యక్తులు ఇటీవల నీటిని వదిలారు. గతంలో కాంట్రాక్టర్ చేపలు పట్టేందుకు కొంత నీటిని ఖాళీ చేయగా రెండు రోజులుగా తూము ద్వారా నీటిని తరలించినట్లు స్థానికులు తెలిపారు.

వారబందీతో చివరి ఆయకట్టుకు అందని నీరు

గోదావరి నీటిని అందిస్తున్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టు రెండో దశలోని సూర్యాపేట జిల్లాలో ఆయకట్టు రైతాంగం సాగు నీటి కోసం ఎదురుచూస్తోంది. కాల్వల సామర్థ్యానికి తగ్గట్టుగా కాకుండా తక్కువగా నీటిని విడుదల చేస్తుండటంతో ఆయకట్టు చివరి భూములు నీరందక పంటలు రంగుమారాయి. కొన్నేళ్లుగా నీటి విడుదల సాఫీగా సాగుతుండటం, భూగర్భజలాలు సమృద్ధిగా ఉండంతో గతంలో మాదిరే రైతులు ఎక్కువ విస్తీర్ణంలో వరి పంటను సాగు చేశారు. జిల్లాలోని ఎస్సారెస్పీ పరిధిలోని తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ నియోజకవర్గాల్లోని 12 మండలాలకు నీరందడం లేదు. దీంతో ఇటు



భూగర్భజలాలు అడుగంటడంతో పాటు కాల్వలకు నీరందక రైతాంగం ఆందోళన చెందుతోంది. పంటలు ఎండిపోయి లక్షల రూపాయల పెట్టుబడిని రైతులు నష్టపోతున్నారు. దీంతో కొద్దిరోజులుగా రైతాంగం ఆందోళన బాటపట్టింది. రాస్తారోకో చేయడంతో కలెక్టరేట్ ఆందోళన చేసినా ఫలితం ఉండటం లేదని వాపోతున్నారు.

ఎండిన వరి, మిరప పంటలు

మోతె: మోతె మండలంలో ఫిబ్రవరి నుంచే సాగు, తాగు నీరు సరిగా సరఫరా కావడంలేదు. మండలంలో ఉన్న 29 గ్రామాల్లో నామవరం, అన్నారిగూడెం, సిరికొండ గ్రామాల్లో కొద్దిమేర సాగునీరు అందుబాటులో ఉంది. మిగతా గ్రామాల్లో చెరువులు, కుంటలు, బోరుబావులు, బోర్లు ఎండిపోవడంతో బోర్లు, బావుల సహాయంతో మిరపతోటలు, వరి సేద్యం చేయడంతో నీరులేక ఏరడానికి సిద్ధంగా మిరపతోటలు ఎండిపోయాయి. వరి పంటలు ఎండిపోయాయి. చేసేదేమీ లేక గొర్రెలు, పశువుల మేతకు ఎకరానికి రెండు నుంచి 3వేల చొప్పున అమ్ముకుంటున్నారు. మండలంలో 19,472 ఎకరాల్లో వరి సాగు చేయగా, ఇప్పటికే 10వేల ఎకరాలు ఎండిపోయాయి. మిరప 5,500 ఎకరాలు సాగుచేయగా రెండు కాపులతోనే నీరు లేక 3,500 ఎకరాలు ఎండిపోయాయి.



ట్యాంకర్‌తో నీటిని తరలిస్తున్న రైతులు

బీఆర్ఎస్‌లో 'గుత్తా' కలవరం

- సీఎం ముఖ్యసలహాదారుడు వేం నరేందర్‌రెడ్డిని కలిసిన అమిత్‌రెడ్డి
- కాంగ్రెస్‌లోకి వెళ్లేందుకే చర్చించారని సమాచారం
- భువనగిరి ఎంపీ సీటుపై కొనసాగుతున్న సమాలోచన
- వ్యక్తిగత సమావేశమే తప్ప రాజకీయాలకు సంబంధం లేదన్న అమిత్

శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తనయుడు గుత్తా అమిత్‌రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్యసలహాదారుడు వేం నరేందర్‌రెడ్డితో సమావేశమవడంపై రాజకీయ దుమారం చెలరేగింది. కాంగ్రె‌స్‌లో చేరి, భువనగిరి లోక్‌సభ స్థానం నుంచి పోటీచేసేందుకు అవకాశం కల్పించాలని కోరేందుకే హైదరాబాద్‌లో మంగళవారం సమావేశమైనట్టు రాజకీయవర్గాల్లో చర్చ సాగుతోంది. అమిత్‌రెడ్డి ఇటీవల రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని సైతం కలిసినట్టు వార్తలు రాగా, వేం నరేందర్‌రెడ్డితో సమావేశమవడంతో ఆయన కాంగ్రె‌స్‌లో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్టు కనిపిస్తోంది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)



శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కుమారుడు అమిత్‌రెడ్డి ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఉమ్మడి జిల్లాలో ఆసక్తికరంగా మారాయి. మునుగోడు ఉప ఎన్నిక సమయంలోనే బీఆర్ఎస్ అభ్యర్థిగా అమిత్‌కు అవకాశం ఇవ్వాలని సుఖేందర్‌రెడ్డి బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను కోరినా, అప్పటి పరిస్థితుల నేపథ్యంలో పోటీకి అవకాశం దక్కలేదు. గుత్తా సుఖేందర్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరినప్పటి నుంచి మాజీ మంత్రి జగదీ‌శ్‌రెడ్డి వర్గంతో కొంత విభేదాలు కొనసాగిన నేపథ్యం, గడిచిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో సుఖేందర్‌రెడ్డి అనుచరులుగా భావించే కీలకనేతలు కాంగ్రె‌స్‌లో చేరడంతో నాడు విమర్శలు వెల్లువెత్తాయి. అసెంబ్లీ ఎన్నికలు ముగిశాక అమిత్‌రెడ్డి ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో నల్లగొండ, భువనగిరి స్థానాల్లో ఎక్కడ అవకాశమిస్తే అక్కడ పోటీచేస్తానని ప్రకటించారు. అంతేగాక తన సేవా ట్రస్ట్ ద్వారా, పార్టీ ద్వారా పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఇటీవల మాజీ సీఎం కేసీఆర్ నల్లగొండ పర్యటన అనంతరం, తాజాగా తాను లోక్‌సభకు పోటీచేయబోవడం లేదని అమిత్‌రెడ్డి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు స్పష్టం చేశారు. అమిత్‌రెడ్డి ప్రకటనపై స్పందించిన మాజీ మంత్రి జగదీ‌శ్‌రెడ్డి ఎంపీగా పోటీచేయాలని అధిష్ఠానం ఇంకా ఎవ్వరికీ చెప్పలేదని, అమిత్ తానే పోటీచేస్తానని ప్రకటించారని, తర్వాత ఆయనే పోటీచేయకుండా విరమించుకున్నారని, ఈ ప్రకటనలకు పార్టీకి ఎలాంటి సంబంధం లేదని ఖండించడం రాజకీయవర్గాల్లో చర్చకు దారితీసింది. ఈ క్రమంలో సోమవారం హైదరాబాద్‌లో మాజీ సీఎం కేసీఆర్ నిర్వహించిన సమావేశానికి కూడా అమిత్‌రెడ్డి డుమ్మా కొట్టడం, తాజాగా ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డితో సమావేశమవడంతో ఆయన కాంగ్రె‌స్‌లోకి వెళ్లేందుకు సిద్ధమయ్యారనే సంకేతాలు వెలువడుతున్నాయి. కాంగ్రె‌స్‌లో నల్లగొండ ఎంపీ టికెట్‌ను ఇప్పటికే కుందూరు రఘువీర్‌రెడ్డికి ప్రకటించగా, భువనగిరి స్థానం కోసం కోమటిరెడ్డి కుటుంబీకులు, ఇతర కీలకనేతలు పోటీపడుతున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా గుత్తా అమిత్ ఈ సీటుని ఆశిస్తుండడం కాంగ్రె‌స్‌లోనూ కాకరేపుతోంది. అమిత్‌కు ఎంపీ టిక్కెట్ ఇస్తారా? లేక భవిష్యత్ హామీతో పార్టీలో చేర్చుకుంటారా? అనే విషయంతో పాటు పార్టీ మార్పు జరిగితే అది అమిత్‌రెడ్డికే పరిమితమవుతుందా? మండలి చైర్మన్‌గా రాజ్యాంగ బద్ధ పదవిలో ఉన్న సుఖేందర్‌రెడ్డి ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనే అంశం తేలాల్సి ఉంది. వేం నరేందర్‌రెడ్డితో సమావేశంపై 'ఆంధ్రజ్యోతి' అమిత్‌రెడ్డిని సంప్రదించగా, నరేందర్‌రెడ్డి తమకు బంధువని, వ్యక్తిగత సమావేశమే తప్ప అందులో రాజకీయం లేదని, పార్టీ మార్పు అంశమేదీ తమ మధ్య చర్చకు రాలేదని తెలిపారు.

ఎన్నికలకు యంత్రాంగం సన్నద్ధం కావాలి

రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికా‌స్‌రాజ్

సూర్యాపేట(కలెక్టరేట్), మార్చి 12: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం సన్నద్ధం కావాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికా‌స్‌రాజ్ అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. స్వీప్ కార్యక్రమాల నిర్వహణ, ఫాం-6, 7, 8 దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలని సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఎన్నికల ప్రణాళిక, బందోబస్తు, ఓటరు జాబితా సవరణ, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, కౌంటింగ్ ఏర్పాట్లు, ఈవీఎం యంత్రాలు, నామినేషన్ల ప్రక్రియ, సిబ్బందికి శిక్షణ, పోస్టల్ బ్యాలెట్, స్వీప్ కార్యక్రమాల నిర్వహణతో పాటు ఇతర అంశాలతో కూడిన ప్రణాళికను రూపొందించాలన్నారు. ఓటరు జాబితాలో మార్పులపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి సమాచారం అందించాలన్నారు. నూతన ఓటర్లకు గుర్తింపు కార్డులు జారీ చేయాలన్నారు. 85ఏళ్ల వయసు పైబడిన వారికి ఇంటి వద్ద నుంచే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించిందన్నారు. ఓటింగ్ శాతం పెరిగేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ బీఎస్.లత, డిప్యూటీ సీఈవో శిరీష, డీఆర్‌డీవో మధుసూదనరాజు, తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికా‌స్‌రాజ్

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి: కలెక్టర్



జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో టీఎస్ ఐపాస్‌పై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఎస్సీ ఎస్టీ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సర్వీస్ సెక్టార్లలో సబ్సిడీ మంజూరైందన్నారు. విశ్వకర్మయోజన పథకంపై ప్రజలకు మరింతగా అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 6,109 దరఖాస్తులు రాగా, వాటిలో 2,808 దరఖాస్తులను పరిశీలించి తదుపరి చర్యల నిమిత్తం పంపామన్నారు. సమావేశంలో పరిశ్రమల శాఖ జీఎం సీతారాం, ఎల్‌డీఎం బాపూజీ, డీటీవో సురే‌శ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పార్లమెంట్ ఎన్నికలకు సన్నద్ధం నేపథ్యంలో కలెక్టరేట్‌లో ఎస్పీ రాహుల్‌హెగ్డేతో కలిసి నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు.సమావేశంలో ట్రైనీ ఐపీఎస్ రాజే‌శ్‌మీనా, మాస్టర్ ట్రైనర్లు విప్పర్ల రమేష్, పబ్బతి వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

• గుట్టలో ధ్వజారోహణం, భేరిపూజ

యాదగిరిగుట్ట: ఏకశిఖరవాసుడు.. స్వయంభు పాంచనారసింహుడు కొలువైన దివ్యక్షేత్రం.. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో రెండో రోజు మంగళవారం ఆధ్యాత్మిక పర్వాల కోలాహలం నెలకొంది. బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టానికి వేదపండితులు శ్రీకారం చుట్టారు. ధ్వజారోహణం, దేవతాహ్వానం, హోమ పూజలు, రుత్వికుల వేద పారాయణ పఠనాలతో యాదగిరికొండ ఆధ్యాత్మిక సందడిని సంతరించుకుంది.



భేరిపూజ నిర్వహిస్తున్న వేదపండితులు

గేట్లు తెరవడం కాదు... ప్రాజెక్టుల గేట్లు ఎత్తాలి

- రాష్ట్రంలో కరువు పాపం కాంగ్రెస్‌దే
- మాజీ మంత్రి జగదీ‌శ్‌రెడ్డి



కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న మాజీ మంత్రి జగదీ‌శ్‌రెడ్డి

చివ్వెంల, మార్చి 12: ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు రేవంత్‌రెడ్డి గేట్లను తెరవడం కాదు.. ఎండుతున్న పంటల కోసం శ్రీశైలం, సాగర్ ప్రాజెక్టుల గేట్లను ఎత్తాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీ‌శ్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రం 5వ వార్డులోని శ్రీలింగమంతులస్వామి ఆలయ ప్రాంగణంలో ఎంపీ(రాజ్యసభ)నిధులు రూ.65లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను ఎంపీ బి.లింగయ్యయాదవ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జగదీ‌శ్‌రెడ్డి మాట్లాడుతూ, సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యేలను కొనుగోలు చేయాలనే సోయి మినహా ప్రజల కష్టాలపై పట్టింపులేదన్నారు. చరిత్రలో మూడు నెలల్లో విఫలమైన ప్రభుత్వం కాంగ్రెసేనని అన్నారు. కుంగిన మేడిగడ్డ పిల్లర్లకు, నీళ్ల ఎత్తిపోసుకోవడానికి సంబంధం లేదన్నారు. ఇప్పటికీ కాళేశ్వరం ప్రాజెక్టులో నాలుగు వేల క్యూసెక్కుల నీరు ఉందన్నారు. కర్ణాటకలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉందని, మిత్రులైన ఆ ప్రభుత్వ నేతలతో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మాట్లాడి 10టీఎంసీల నీటిని తెప్పించాలన్నారు. సాగు నీరు లేక రైతు కంట కన్నీళ్లు వస్తున్నాయన్నారు. రాష్ట్రంలో కరువు పాపం ముమ్మాటికీ కాంగ్రెస్‌దేనని అన్నారు. తక్షణమే కరువుపై సమీక్షలు నిర్వహించాలని, లేకుంటే రైతుల ఉసురు తగులుతుందన్నారు. సీఎంగా కేసీఆర్ ఉంటే కరువు వచ్చేది కాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో తాగు, సాగు నీరుతో పాటు కరెంట్ కూడా పోయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పాత వెలుగులు పోయి కొత్త చీకట్లు వచ్చాయన్నారు. డ్రామాలు ఆడి ప్రభుత్వం నడపడం కాదని, దమ్ముంటే నీరు, కరెంట్ ఇవ్వాలన్నారు. వ్యాపారులను బెదిరించి ఢిల్లీకి ముడుపులు మోయడం మినహా, సీఎం రేవంత్‌కు మరో సోయి లేదని ఆరోపించారు. సమావేశంలో కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్, మునిసిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, జడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణ, మునిసిపల్ వైస్ చైర్‌పర్సన్ పుట్ట కిషోర్, జడ్పీటీసీ జీడి భిక్షం, కాంగ్రెస్ బీసీ సెల్ రాష్ట్ర నాయకుడు తండు శ్రీనివాస్‌యాదవ్, ప్రముఖ వైద్యుడు రాంమూర్తియాదవ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పరిస్థితి అర్థం కావడం లేదు

● పార్లమెంట్‌కు పోటీ చేయాలంటే నేతలు భయపడుతున్నారు ● మాజీ ఎమ్మెల్యే సైదిరెడ్డి టెలీ కాన్ఫరెన్స్ వాయిస్ రికార్డ్ వైరల్

నేరేడుచర్ల, మార్చి 12: 'రాష్ట్రంలో బీజేపీ పుంజుకుంటోంది. బీఆర్ఎస్ పరిస్థితి అర్థం కావడం లేదు. పార్లమెంటుకు పోటీ చేయాలంటే ఆ పార్టీ నేతలు చాలామంది భయపడుతున్నారని హుజూర్‌నగర్ మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. ఇటీవల బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరిన సైదిరెడ్డి నేరేడుచర్ల ముఖ్య కార్యకర్తలతో టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. చెప్పకుండా వెళ్లడం తప్పేనని, అందుకు క్షమించాలని, కానీ తన వెంట ఉంటారనే నమ్మకంతోనే వెళ్లానని వారికి వివరణ ఇచ్చారు. ఇందుకు సంబంధించిన వాయిస్ రికార్డ్ సోషల్‌మీడియాలో వైరల్ అవుతోంది. సైదిరెడ్డి సంభాషణ ఇలా సాగింది. 'ఢిల్లీ రావాలని బీజేపీ ముఖ్యుల నుంచి పిలుపు వచ్చింది. అక్కడికి వెళ్లిన తర్వాత అక్కడున్న పెద్దలు కండువా కప్పుకోవాలన్నారు. పార్లమెంట్ టికెట్ నీకే ఖరారవుతుందన్నారు. ఇప్పుడు నువ్వు కండువా కప్పుకోకపోతే రాష్ట్రంలో బీజేపీ పరువు పోతుందని ఒత్తిడి తెచ్చారు. ఇప్పుడు కేంద్రంలో మోదీ ప్రభుత్వం ఉంది. మళ్లీ మోదీనే వస్తాడు. వాళ్లు నన్ను కావాలని కోరుకోవడం నాకు మంచిదవుతుందనుకున్న. రాష్ట్రంలో 10నుంచి 12సీట్లు బీజేపీకి వచ్చే అవకాశం ఉంది. టీడీపీ కనుమరుగైపోయింది. బీఆర్ఎస్ పరిస్థితి అర్థం కావడంలేదు. బీజేపీ పుంజుకుంటోంది. ఇప్పుడు మారకపోతే ఆగమైతం అని ఆలోచించిన. రెండుమూడు రోజుల్లో హుజూర్‌నగర్‌కు వచ్చి మీటింగ్ పెడ్తా, నావెంటే ఉండాలి. జై తెలంగాణ' అని సంభాషణ ముగించారు.

చైన్‌స్నాచర్ అరెస్టు

చౌటుప్పల్ రూరల్ మార్చి 12: చైన్‌స్నాచర్‌ను యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పోలీసులు మంగళవారం అరెస్టు చేసి రిమాండ్ చేశారు. సీఐ అశోక్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా రాజ్‌నాయక్‌తండా గ్రామానికి చెందిన హర్కవాత్ వెంకన్ననాయక్(32) చౌటుప్పల్‌లో వంట మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. వెంకన్న బైక్‌పై వచ్చి ఈ నెల 7న చౌటుప్పల్ పట్టణకేంద్రంలో పొట్ట వెంకటేశం మెడ నుంచి రెండు తులాల బంగారు గొలుసును అపహరించి పరారయ్యాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసిన పోలీసులు వెంకన్ననాయక్‌ను అరెస్టు చేశారు. అనంతరం చౌటుప్పల్ కోర్టులో హాజరు పరిచారు. మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు నిందితుడిని నల్లగొండ జైలుకు తరలించారు.

మండలాధ్యక్షులపై అవిశ్వాసాలు పెట్టొచ్చు

- నోటీసులు ఇచ్చే అధికారం ఆర్డీవోలకు ఉంది
- హైకోర్టు స్పష్టీకరణ .. పలువురి దావాల కొట్టివేత


హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులకు వ్యతిరేకంగా వచ్చిన అవిశ్వాస తీర్మానాలపై సమావేశాలు నిర్వహించే అధికారం ఆర్డీవోలకు ఉందని హైకోర్టు తేల్చిచెప్పింది. పలు మండలాల అధ్యక్షులు దాఖలు చేసిన పిటిషన్లను కొట్టివేసింది. తమకు వ్యతిరేకంగా అవిశ్వాస సమావేశాలు నిర్వహించేలా ఆర్డీవోలు నోటీసులు జారీ చేయడాన్ని సవాల్ చేస్తూ.. యాదాద్రి భువనగిరి జిల్లా నారాయణపూర్ ఎంపీపీ ఉమాదేవి, రామన్నపేట్ ఎంపీపీ జ్యోతి, మద్నూర్ ఎంపీపీ లక్ష్మీబాయి, రామారెడ్డి ఎంపీపీ దశరథ్‌రెడ్డి, వరంగల్ జిల్లా గీసుకొండ ఎంపీపీ సౌజన్య, రంగారెడ్డి జిల్లా మర్రిగూడ ఎంపీపీ మోహన్‌రెడ్డి, సరూర్‌నగర్ ఎంపీటీసీ ప్రతాప్‌రెడ్డి, నల్లగొండ జిల్లా చండూర్ ఎంపీపీ పల్లె కల్యాణి, కరీంనగర్ జిల్లా రామడుగు ఎంపీపీ కలగంటి కవిత, ఆదిలాబాద్ జిల్లా ఏలూరు సారంగాపూర్ మండల ఉపాధ్యక్షుడు, జనగాం జిల్లా మల్యాల ఎంపీపీ విమల, కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ ఎంపీపీ సువర్ణ, డిచ్‌పల్లి ఎంపీపీ శ్రీనివాస్, నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలానికి చెందిన సుజాత, ప్రభాకర్ తదితరులు ఈ పిటిషన్లు దాఖలు చేశారు. ఆర్డీవోల నుంచి తమకు అవిశ్వాస నోటీసులు అందాయని, తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం 2018లోని సెక్షన్ 263 ప్రకారం ఆ నోటీసులు ఇచ్చే అధికారం ఆర్డీవోకు లేదని పేర్కొన్నారు. ఈ నోటీసులను కొట్టివేయాలని కోరారు. విచారణ చేపట్టిన జస్టిస్ కే శరత్ ధర్మాసనం నోటీసులు జారీ చేసే అధికారం ఆర్డీవోలకు ఉందని తెలిపింది. సాంకేతిక కారణాలు చూపించి అవిశ్వాసాన్ని తప్పించుకోలేరని పేర్కొంది.

గుదిబండగా కరెంటు ఒప్పందాలు

ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్తును వాడకున్నా.. రూ.వందల కోట్లలో బిల్లుల బకాయిలు.. న్యాయ విచారణకు సర్కారు నిర్ణయం

- జస్టిస్ నర్సింహారెడ్డితో కమిషన్
- యాదాద్రి, భద్రాద్రి ప్లాంట్లపైనా విచారణ

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గుదిబండగా మారిన ఛత్తీస్‌గఢ్ కరెంటు ఒప్పందాల దుమ్మును దులపాలని రేవంత్‌రెడ్డి సర్కారు నిర్ణయించింది. ఛత్తీస్‌గఢ్ నుంచి కరెంటును కొనుగోలు చేయకున్నా.. ప్రస్తుతం ఒక్కయూనిట్ సరఫరా లేకున్నా.. వేల కోట్లలో బిల్లులు కట్టాల్సి రావడంపై న్యాయ విచారణకు ఆదేశించింది. ఇందుకోసం సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డితో కమిషన్‌ను ఏర్పాటు చేసింది. అంతేకాదు.. యాదాద్రి, భద్రాద్రి థర్మల్ ప్లాంట్లపైనా ఈ కమిషన్ విచారణ జరుపుతుంది.



ఇదీ ఛత్తీస్‌గఢ్ కరెంటు కథ?

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక.. విద్యుత్తు అవసరాలను తీర్చాలనే ఉద్దేశంతో అప్పటి కేసీఆర్ ప్రభుత్వం 2015 సెప్టెంబరు 22న ఛత్తీస్‌గఢ్‌లోని 1,000 మెగావాట్ల మార్వా ప్లాంట్ నుంచి 12 ఏళ్ల పాటు విద్యుత్తు కొనుగోలుకు ఒప్పందాలను కుదుర్చుకుంది. ఈ మేరకు పీపీఏ కింద తెలంగాణ డిస్కమ్‌లు, సీఎస్‌పీడీసీఎల్(ఛత్తీస్‌గఢ్) ఒప్పందాలపై సంతకాలు చేశాయి. అప్పట్లోనే విద్యుత్తు ఉద్యోగుల జేఏసీ అభ్యంతరాలు వ్యక్తం చేసినా.. ప్రభుత్వం కౌంటర్ సమర్థనలను చేయిస్తూ.. ముందుకెళ్లింది. ఇక ఛత్తీస్‌గఢ్ నుంచి కరెంటు సరఫరాకు వీలుగా పవర్ గ్రిడ్ కార్పొరేషన్(పీజీసీఐఎల్)తోనూ ఒప్పందం చేసుకుంది. ఇప్పుడు ఛత్తీస్‌గఢ్ కరెంటును కొనుగోలు చేయకపోవడంతో.. పెనాల్టీ కింద రూ.300 కోట్లను పీజీసీఐఎల్‌కు చెల్లించాలని కేంద్ర విద్యుత్తు నియంత్రణ మండలి(సీఈఆర్‌సీ) ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు.. బకాయిల పేరుతో మార్వా ప్లాంట్ నుంచి విద్యుత్తు సరఫరా జరగకున్నా.. పాయింట్ ఆఫ్ కనెక్షన్ చార్జీలు(పీవోసీ) రూపంలో ఏటా రూ.400 కోట్ల నుంచి రూ.450 కోట్లను చెల్లించాల్సి వస్తోంది. స్థిర చార్జీల భారం కూడా తెలంగాణ డిస్కమ్‌లను వీడడం లేదు. 2020-21లో రూ.828.13 కోట్లు, 2021-22లో రూ.394.98 కోట్ల మేర స్థిరచార్జీలను చెల్లించాల్సి ఉంది. ఈ మొత్తం కాస్తా లేట్‌పేమెంట్‌తో కలుపుకొని రూ.3,576.89 కోట్లకు పెరిగినట్లు ఛత్తీస్‌గఢ్ చెబుతుండగా.. అది కేవలం రూ.2,100 కోట్లేనని తెలంగాణ డిస్కమ్‌లు వాదిస్తున్నాయి. కరెంటు బిల్లుల బకాయిలున్నాయంటూ రెండేళ్ల క్రితమే ఛత్తీస్‌గఢ్ కరెంటు సరఫరా నిలిచిపోయింది. నిజానికి తెలంగాణ డిస్కమ్‌లు 2021-22లో 1,631 మిలియన్ యూనిట్లు(కేవలం 19%) కొనుగోలు చేశాయి. 2022-23 ద్వితీయార్థంలో 2,713 మిలియన్ యూనిట్ల(31%) విద్యుత్తును కొనాలని అంచనాలు వేసినా.. ఆ పరిస్థితి లేదని తేలిపోయింది. 2023-24లో 78% విద్యుత్తు కొంటామనే అంచనాలున్నాయి. ఛత్తీస్‌గఢ్ డిస్కమ్‌లు బకాయిల పేరుతో ఆ మేరకు విద్యుత్తు సరఫరాను నిలిపివేశాయి. రెండేళ్లుగా కరెంటు సరఫరా లేకున్నా.. 12 ఏళ్ల పాటు విద్యుత్తు కొనుగోలు ఒప్పందం బూచీగా ఇప్పుడు తెలంగాణ డిస్కమ్‌లపై భారం పడే ప్రమాదం ఉంది. ఒప్పందంలో ఇంకా ఆరేళ్లు మిగిలే ఉన్నాయి. పీపీఏ ఒప్పందం ప్రకారం విద్యుత్తును కొనకుంటే.. ఛత్తీస్‌గఢ్ డిస్కమ్‌లు ఆ కరెంటును ఓపెన్‌యాక్సెస్‌లో విక్రయించుకోవచ్చు. ఒకవేళ తెలంగాణ ఒప్పందం కంటే.. ఓపెన్‌యాక్సెస్ విక్రయం తక్కువ ధరలో ఉంటే.. ఆ భర్తీని తెలంగాణ డిస్కమ్‌లు భూడ్చాల్సి ఉంటుంది. ఇప్పుడు ఈ బకాయిలన్నీ తెలంగాణ డిస్కమ్‌ల పాలిట గుదిబండగా మారాయి. దీనిపై తెలంగాణ డిస్కమ్‌లు 2018లో విద్యుత్తు అప్పిలేట్ ట్రిబ్యునల్(అప్టెల్)ను ఆశ్రయించినా.. ఆ కేసు తేలే దాకా ఇబ్బందులు తప్పేలా లేవు. బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన ఈ తొందరపాటు ఒప్పందాలపై ఇప్పుడు రేవంత్ సర్కారు విచారణ జరిపించనుంది. మరోవైపు.. యాదాద్రి, భద్రాద్రి థర్మల్ ప్లాంట్లను వినియోగించుకోవాలా? వదిలేయాలా? అంటూ ఇటీవల ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. భద్రాద్రిలో ఒక్కో ప్లాంట్ 270 మెగావాట్ల సామర్థ్యంతో.. మొత్తం నాలుగు ప్లాంట్లు 1,080 మెగావాట్లను ఉత్పత్తి చేస్తాయి. ఈ ప్లాంట్‌పై అప్పట్లోనే తీవ్ర స్థాయిలో విమర్శలు వచ్చాయి. సూపర్ క్రిటికల్ టెక్నాలజీ అందుబాటులో ఉన్నా.. సబ్-క్రిటికల్ టెక్నాలజీతో ప్లాంట్ కట్టడంపై నిపుణులు విమర్శలు చేశారు. 4 వేల మెగావాట్ల సామర్థ్యంతో యాదాద్రి ప్లాంట్ ఇంకా నిర్మాణంలోనే ఉంది. ఇక్కడ కూడా భూసేకరణ, టౌన్‌షిప్‌ల నిర్మాణం, సబ్-కాంట్రాక్టుల్లో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలున్నాయి. ఈ అంశాలపైనా జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్ విచారణ జరపనుంది.

ఫలించిన 15 ఏళ్ల నిరీక్షణ

- రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం పట్ల డీఎస్సీ 2008 అభ్యర్థుల హర్షం
- కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో న్యాయం జరిగిందని ఆనందం

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ 2008లో అర్హత పొంది, నియామకాలు పొందని అభ్యర్థులకు కనీస వేతనాల పద్ధతిలో ఉద్యోగాలు ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం పట్ల అభ్యర్థులు, వారి కుటుంబసభ్యులు హర్షం వ్యక్తం చేశారు. తాము 15 ఏళ్లుగా పడుతున్న కష్టాల నుంచి ప్రభుత్వ ప్రకటనతో ఉపశమనం కలిగిందన్నారు. మంగళవారం సచివాలయంలోని మీడియా పాయింట్ వద్ద అభ్యర్థులు, అసోసియేషన్ ప్రతినిధులు సంబరాలు చేసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ... దశాబ్దంనర కాలంగా ఎదురుచూపులు నేడు ఫలించాయని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రులందరికీ ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో తమకు న్యాయం జరిగిందని ఆనందం వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీకి కట్టుబడి, తమకు కాంట్రాక్ట్ పద్ధతిలో అయినా ఉద్యోగాలు ఇచ్చేందుకు ముందుకొచ్చినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా తమకు సహకరించిన ప్రజాప్రతినిధులకు, విద్యాశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశంతో పాటు ఇతర అధికారులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. త్వరగా విధివిధానాలు ప్రకటించాలని వారు సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో 'డీఎస్సీ 2008 అసోసియేషన్' అధ్యక్షుడు ఉమామహేశ్వర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మాకు ఉద్యోగాలు ఇవ్వండి

- డీఎస్సీ 1998 క్వాలిఫైడ్ టీచర్ల మొర
- వేర్వేరు సమస్యలపై 'ప్రజావాణి'కి 1470 అర్జీలు

సికింద్రాబాద్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): తమకు తక్షణమే ఉద్యోగాలు ఇవ్వాలంటూ డీఎస్సీ 1998లో అర్హత సాధించిన ఉపాధ్యాయులు ప్రభుత్వానికి మొర పెట్టుకున్నారు. 1998 డీఎస్సీలో నియామక ప్రక్రియ లోపభూయిష్టంగా జరిగిందని, ఎన్నికలు రావడంతో 1999లో డీఎస్సీ ప్యానల్‌ను రద్దు చేశారన్నారు. దాంతో డీఎస్సీ-98లో క్వాలిఫై అయిన అభ్యర్థులు ఉద్యోగావకాశాలు కోల్పోయారని తెలిపారు. ఈ మేరకు ప్రజాభవన్‌కు తరలివచ్చిన పలువురు అభ్యర్థులు ప్రజావాణిలో అర్జీ పెట్టుకున్నారు. ఇదే కాదు.. రేషన్ కార్డులు, పెన్షన్లు, ధరణి సమస్యలు, ఉద్యోగాలు, వైద్యంతోపాటు వేర్వేరు సమస్యలపై ప్రజావాణికి మంగళవారం 1,470 అర్జీలు వచ్చాయి. ఇందులో రెవెన్యూ పరమైన సమస్యలు 327, ఇంటి కోసం 251, పంచాయతీరాజ్ విభాగానికి 200, మైనార్టీ వెల్ఫేర్ సంబంధించి 145అర్జీలు ఉన్నాయి. ఆయా దరఖాస్తులను ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జీ.చిన్నారెడ్డి, ప్రజావాణి నోడల్ అధికారి దివ్య, ఇతర అధికారులు ప్రజలను స్వీకరించారు. సంబంధిత విభాగాల ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కాగా, పుట్టుకతో అంగవైకల్యంతో బాధపడుతున్న తనకు పెన్షన్ మంజూరు చేయాలని నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలం రాంచంద్రాపూర్ గ్రామానికి చెందిన దండు గౌతమ్ (13) దరఖాస్తు చేసుకున్నాడు. ఆరో తరగతి విద్యార్థి అయిన గౌతమ్ లేచి నిలబడాలన్నా, కూర్చోవాలన్నా ఇతరులపై ఆధారపడే స్థితిలో ఉన్నాడు. అలాగే, రైలు ప్రమాదంలో తగిలినగాయాల వల్ల తన కాలు, చెయ్యి పని చెయ్యడం లేదని, ఆర్థిక సమస్యల్లో ఉన్న కుటుంబాన్ని పోషించుకునేందుకు తనకు ఉద్యోగం ఇప్పించాలని నాంపల్లి నేతాజీనగర్‌కు చెందిన జి.శశికాంత్ దరఖాస్తు చేసుకున్నారు. ఉప్పల్‌కు చెందిన పలువురు వృద్ధ మహిళలు తమకు పెన్షన్ మంజూరు చేయాలని, అంబర్‌పేటకు చెందిన పలువురు మహిళలు రేషన్ కార్డు కోరుతూ అర్జీలు పెట్టారు. కాగా, తమ ఉద్యోగాన్ని క్రమబద్ధీకరించాలని, వేతనాన్ని రూ.19,500కు పెంచాలని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న పార్ట్ టైమ్ స్వీపర్లు అర్జీ చేసుకున్నారు. గత ప్రభుత్వం తీరు వల్ల 1500 మంది అభ్యర్థులు ఉద్యోగాలు లేక అవస్థలు పడుతున్నారని, ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన జూనియర్ లైన్‌మెన్లు అభ్యర్థించారు. బేగంపేట్‌లోని ఈశ్వరీయ విశ్వ విద్యాలయ కేంద్రంలో నిర్వహించే ఆధ్యాత్మిక తరగతులకు తమను రానివ్వడం లేదంటూ పలువురు మహిళలు ఫిర్యాదు చేశారు.



పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న బాలుడు గౌతమ్



అంటువ్యాధుల నివారణ కోసం నిర్మించబోయే ప్రయోగశాల భూమిపూజలో పాల్గొన్న వివిధ రంగాల ప్రముఖులు

అంటువ్యాధుల నివారణకు ప్రయోగశాల

- 25 కోట్లతో ఐఐపీహెచ్ ఆవరణలో ఏర్పాటు
- హిమాయత్‌సాగర్‌లో భూమిపూజ
- భవిష్యత్‌లో పలు పరిశోధనలు

రాజేంద్రనగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఒకరి నుంచి మరొకరికి వ్యాపించే అంటువ్యాధుల నుంచి ప్రజలను కాపాడేందుకు హిమాయత్‌సాగర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్(ఐఐపీహెచ్) ఆవరణలో రూ.25 కోట్లతో ప్రయోగశాల(సైరస్ పూనావాలా సెంటర్ ఫర్ ఇన్‌ఫెక్షియస్ డిసీజెస్ అండ్ పాండమిక్ ప్రిపేర్డ్‌నెస్) నిర్మించనున్నట్లు ఐఐపీహెచ్ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ మధుబాల రెంటల తెలిపారు. ఈ సెంటర్‌కు భూమిపూజను విల్లో పూనావాలా ఫౌండేషన్ సీఈవో జస్వీందర్ నారంగ్, ఇంటర్నేషనల్ పబ్లిక్ హెల్త్ సొసైటీ ఛైర్మన్ సి. శ్రీనివాస రాజు, ఐఐపీహెచ్ చీఫ్ మెంటార్ డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ ప్రొఫెసర్ సంజయ్ జొడెపె, యూఎస్‌ఏకు చెందిన డాక్టర్ అనిల్ కౌల్‌తో కలిసి మంగళవారం నిర్వహించినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఈ సెంటర్ అంటువ్యాధులను ఎదుర్కోవడానికి అంకితమైన మార్గదర్శక కేంద్రంగా పనిచేస్తుందన్నారు. దేశంలో, రాష్ట్రంలో అంటువ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలను సూచించడంలో ముందుంటుందన్నారు. ఈ సందర్భంగా కిమ్స్ ఫౌండేషన్ రీసెర్చ్ సెంటర్ వారు క్యాన్సర్ స్క్రీనింగ్ ఎక్స్‌ప్రెస్ పేరుతో సుమారు రూ.10 కోట్ల విలువ చేసే క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించే బస్సును ఐఐపీహెచ్‌కు బహూకరించారు. ఈ బస్సులో ఇక మీదట గ్రామాల్లో తిరుగుతూ మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

మూడు బోర్లు వేసి అప్పుల పాలై రైతు ఆత్మహత్య

- మెదక్ జిల్లాలో కిష్టాపూర్‌లో ఘటన
- విద్యుదాఘాతంతో మహిళా రైతు, ఎలక్ట్రీషియన్ మృతి

చేగుంట, అడ్డగూడూరు, కోదాడ రూరల్, మార్చి 12: చేతికొచ్చే సమయంలో పంట ఎండిపోకూడదని మూడు బోర్లు వేయించినా చుక్క నీరు రాకపోగా.. అప్పుల పాలవ్వడంతో కలత చెందిన ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. మెదక్ జిల్లా చేగుంట మండల పరిధి కిష్టాపూర్‌కు చెందిన కుర్మ స్వామి(30) అనే రైతు తన పొలంలోని చెట్టుకు మంగళవారం ఉరి వేసుకుని మరణించాడు. కుర్మ స్వామి తనకున్న నాలుగు ఎకరాలలో వరిసాగు చేస్తున్నారు. పంటను కాపాడుకునేందుకు మూడు బోర్లు వేశారు. బోర్లు వేసేందుకు, పంట సాగుకు సుమారు నాలుగు లక్షల అప్పు చేశారు. నీళ్లు రాక పొలం ఎండిపోగా, అప్పుల బాధ తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుర్మ స్వామికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా, పొలంలో కింద పడి ఉన్న 11కేవీ త్రీఫేజ్ మెయిన్ వైరును తొక్కి విద్యుదాఘాతానికి గురై యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం జానకీపురం గ్రామానికి చెందిన బోనాల లక్ష్మి(40) అనే మహిళా రైతు ప్రాణాలు కోల్పోయారు. లక్ష్మి రోజు మాదిరిగా మంగళవారం సాయంత్రం పొలంకు వెళ్తున్న క్రమంలో ప్రమాదానికి గురయ్యారు. ఇక, సూర్యాపేట జిల్లా కోదాడ మండలం కాపుగల్లు గ్రామానికి చెందిన షేక్ జానీమియా(35) అనే ఎలక్ట్రీషియన్ తన ఇంట్లో తెగిన విద్యుత్ తీగకు మర్మమతుల చేస్తూ విద్యుదాఘాతానికి గురై మరణించాడు.

రాష్ట్రంలోని మెడికల్ కాలేజీల్లో 4,356 అధ్యాపక పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్

- కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో నియామకం
- నోటిఫికేషన్ జారీ.. 16న వాక్ ఇన్ ఇంటర్వ్యూలు
- నాణ్యమైన విద్యే లక్ష్యం: మంత్రి దామోదర

పోస్టులు	ఖాళీల సంఖ్య	వేతనం (రూ.లలో)
ప్రొఫెసర్	498	1,90,000
అసోసియేట్ ప్రొఫెసర్	786	1,50,000
అసిస్టెంట్ ప్రొఫెసర్	1459	1,25,000
సీనియర్ రెసిడెంట్స్	1201	92,575
ట్యూటర్స్	412	55,000

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 26 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో అధ్యాపకుల కొరత తీర్చేందుకు రేవంత్ రెడ్డి సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. 2021 అక్టోబరు నుంచి ఖాళీగా ఉన్న 4,356 టీచింగ్ పోస్టులను కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ప్రతిపాదికన భర్తీ చేయాలన్న రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ మేరకు రాష్ట్ర ఆర్థిక శాఖ జీవో ఎంఎస్ నం.98 విడుదల చేసింది. ఇందులో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ట్యూటర్, సీనియర్ రెసిడెంట్ పోస్టులు ఉన్నాయి. ఈ పోస్టుల భర్తీతో ఏటా సర్కారుపై అదనంగా రూ.634 కోట్ల భారం పడుతుందని మంత్రి తెలిపారు. మెడికల్ కాలేజీల్లోని అధ్యాపకుల నియామకాలన్నీ జిల్లా కలెక్టర్ల నేతృత్వంలోని డిస్ట్రిక్ట్ సెలెక్షన్ కమిటీల ద్వారా సత్వరమే చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్రంలో వైద్య కళాశాలల బలోపేతం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. జాతీయ వైద్య కమిషన్ నియమ నిబంధనలకు అనుగుణంగా నాణ్యమైన విద్య అందించడానికి పోస్టులు భర్తీ చేస్తున్నామన్నారు. కాగా, కాలేజీల వారీగా పోస్టుల వివరాలను ఆయా కాలేజీల వెబ్‌సైట్లలో పొందుపర్చారు. కాలేజీల వెబ్‌సైట్ల వివరాలు డిపార్ట్‌మెంట్ వెబ్‌సైట్‌లో (htpps://dme.telangana.gov.in) ఉన్నాయి. అన్ని కాలేజీల్లో ఈ నెల 16న వాక్-ఇన్-ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. అర్హతలున్న అభ్యర్థులు నోటిఫికేషన్‌లో పేర్కొన్న సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు.

లోక్‌సభ ఎన్నికలకు ఖర్గే దూరం!

- ఒక నియోజకవర్గానికే పరిమితం కాదలుచుకోలేదు: ఏఐసీసీ చీఫ్
- దేశవ్యాప్తంగా దృష్టి పెడతానని వెల్లడి
- గుల్బర్గా నుంచి అల్లుడిని దింపే చాన్స్

న్యూఢిల్లీ, మార్చి 12: ఏఐసీసీ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు మల్లికార్జున ఖర్గే రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండే అవకాశం కనిపిస్తోంది. ఈ ఎన్నికలు అత్యంత కీలకమని, పార్టీని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. తాను కూడా పోటీ చేస్తే ఒక నియోజకవర్గంపైనే దృష్టి పెట్టి, అక్కడే పరిమితం కావాల్సి ఉంటుందని ఖర్గే అభిప్రాయపడ్డారు. అయితే, పార్టీ వర్గాలు మాత్రం ఆయన పోటీ చేయాలని కోరుకుంటున్నాయి. ఈ ఎన్నికలను వదులుకోకూడదని, పోటీలో ఉండే పార్టీని ముందుండి నడిపించాలని వారు చెబుతున్నారు. కానీ, వీరి వాదనను ఖర్గే తోసిపుచ్చుతున్నారు. "రానున్న ఎన్నికలు అత్యంత కీలకం. పార్టీ చీఫ్‌గా ఒకే నియోజకవర్గానికి పరిమితం కాలేను. దేశవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల పైనా దృష్టిపెట్టాల్సి ఉంది" అని ఖర్గే తెలిపారు. కర్ణాటకలోని గుల్బర్గా నియోజకవర్గం నుంచి ఖర్గేని రంగంలోకి దింపాలని గత వారం జరిగిన సమావేశంలో నేతలు ఏకగ్రీవంగా భావించారు. ఈ నేపథ్యంలో ఆయన పేరును జాబితాలోనూ చేర్చారు. అయితే, ఖర్గే పోటీకి దూరంగా ఉండి, ఈసారి తన అల్లుడు రాధాకృష్ణన్ దొడ్డమానిని బరిలో నిలపాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది. గుల్బర్గా నియోజకవర్గం నుంచి వరుసగా రెండు సార్లు విజయం సాధించిన ఖర్గే 2019 ఎన్నికల్లో పరాజయం పాలయ్యారు. అప్పటి నుంచి ఆయన రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. పెద్దల సభలో విపక్ష నాయకుడిగా కూడా వ్యవహరిస్తున్నారు. మరో నాలుగేళ్ల ఆయన పదవీ కాలం ఉంది. ప్రస్తుతం ఖర్గే కుమారుడు ప్రియాంక్ ఖర్గే సిద్దరామయ్య మంత్రి వర్గంలో కేబినెట్ మంత్రిగా ఉన్నారు. తొలుత ప్రియాంక్‌ను పార్లమెంటు బరిలో నిలపాలని అనుకున్నా.. తర్వాత ఈ నిర్ణయాన్ని పార్టీ వెనక్కి తీసుకుంది. ఇదిలా వుంటే, ఖర్గే కనుక పోటీ చేయకపోతే, ఏఐసీసీ అధ్యక్షులుగా ఉండి ఎన్నికలకు దూరంగా ఉన్న వారిలో ఈయనే తొలి నాయకుడు అవుతారు.

తీరనున్న నాలుగు గ్రామాల కల

» రెడ్లకుంట ఎత్తిపోతల పథకానికి నేడు శంకుస్థాపన » తీరనున్న సాగు, తాగు నీటి కష్టాలు



లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మిస్తున్న ప్రదేశం ఇదే

కోదాడ రూరల్, మార్చి 12: మండలంలోని నాలుగు గ్రామాల్లో ప్రజల కల తీరనుంది. రైతులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న రెడ్లకుంట లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిలు బుధవారం శంకుస్థాపన చేయనున్నారు. శాసన సభ ఎన్నికల సందర్భంగా భారీ మెజార్టీతో గెలిపిస్తే సాగర్ ఎడమకా ల్వ చివరి భూముల రైతులకు సాగు నీరు, ప్రజలకు తాగు నీరు అందించేందు పాలేరు వాగుపై ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేస్తామని పద్మావతి హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు ప్రభుత్వం ఏర్పడిన 100రోజుల్లోనే రూ.47.54 కోట్లతో రెడ్లకుంట, నల్లబండగూడెం గ్రామాల మధ్య పాలేరు వాగుపై లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి శం కుస్థాపన చేయనున్నారు. ఈ లిఫ్ట్ కింద రెడ్లకుంట, నల్లబండగూడెం, కాపుగల్లు, కూచిపూడి గ్రామాలకు సాగు,తాగు నీరు అందనుంది. ఈ గ్రామాల ప్రజలు నాగు, తాగునీటి కోసం ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వం హయాంలో సాగర్ ఎడమకాల్వకు వారబందీ పద్ధతిలో నీటిని విడుదల చేసినా, కాల్వచివరి భూములకు నీరందలేదు. దీంతో ఆయా గ్రామాల రైతులు బోర్లు, బావులు, చెరువుల మీదనే ఆధారపడి వ్యవసాయం చేశారు.

పేరుకే సాగర్ ఆయకట్టు గ్రామాలని పేరుందని, ఇప్పటివరకు తమ పొలాలకు నీరందిన దాఖలాలు లేవని ఆయా గ్రామాలు రైతులు తెలిపారు. పక్కనే నిండు కుండలా పాలేరు వాగు నుంచి నీరు ప్రవహిస్తున్నా,తమ పొలాలకు నీరందించలేని దుస్థితి ఉందని ఆయా గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రాంతంలో లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులకు,అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేదని, కేవలం చిన్నపాటి చెక్ డ్యాంలు నిర్మించి చేతులు దులుపుకున్నారని,వాటితో ఎటువంటి ప్రయోజనం లేదని రైతులు తెలిపారు.

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశాలతో..

మంత్రి ఉత్తమ్ అధికారులను పంపి పాలేరు వాగుపై లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మించడానికి పరిసరాలను పరిశీలించి, ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. దీంతో రెండు నెలల కిందట హైదరాబాద్ నుంచి నీటిపారుదల శాఖ అధికారులు రెడ్లకుంటకు వచ్చి ఆ గ్రామస్థులను కలిసి పాలేరు పాలేరు వాగుపై లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మించే స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. వెంటనే నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ కోసం రూ.47.54కోట్లను మంజూరు చేశారు. దీంతో ఈ ప్రాంత రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గతంలో కోదాడ ఎమ్మెల్యేగా ఉన్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నియోజకవర్గంలో 50కి పైగా లిఫ్ట్ ఇరిగేషన్లు మంజూరు చేయించారు. వాటిలో 35వరకు పని చేస్తుండగా, మరమ్మత్తు లేక మిగిలినవి మూలనపడ్డాయి. ఆంధ్రా సరిహద్దున ఉన్న గ్రామాలను అభివృద్ధి చేయడంలో, తాగు, సాగునీరు అందించడంలో గత ప్రభుత్వం చిన్న చూపు చూసిందని ఈ ప్రాంత రైతులు తెలిపారు. రెడ్లకుంట వద్ద నిర్మిస్తున్న ఈ లిఫ్ట్ ఇరిగేషన్‌తో ఈ ప్రాంత ప్రజల సాగు, తాగు నీటి సమస్యలు తొలగుతాయని గ్రామ మాజీ సర్పంచ్ సాతినేని లీలాఅప్పారావు అన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన లిఫ్ట్ ఇరిగేషన్‌కు మరమ్మతు చేయనందున పనిచేయడంలేదని, అప్పటి నుంచి రైతులు సాగు, తాగునీటి కోసం ఈ ప్రాంత ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు.

ఎత్తిపోతల పథకంతో మా భూములు సస్యశ్యామలం



పాలేరు వాగుపై నిర్మించే లిఫ్ట్ ఇరిగేషన్‌తో రెడ్లకుంట గ్రామంలో బీడు భూములన్నీ సాగులోకి వచ్చే అవకాశం ఉంది. పక్కన పాలేరు వాగు వెలుతున్నా ఇప్పటివరకు ఎవరూ లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మాణానికి ప్రయత్నించలేదు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉంది.

- నారదాసు ముత్తయ్య, రైతు, రెడ్లకుంట.

నీటి సమస్య తీరినట్లే



మా గ్రామంలో ప్రజలు సాగు, తాగు నీటి కోసం ఎన్నో ఏళ్లుగా ఇబ్బంది పడుతున్నారు. లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మాణంతో సమస్యలు తీరనున్నాయి. లిఫ్ట్ ఇరిగేషన్ మంజూరు చేసిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు.

- మల్లెల రాణి, ఎంపీపీ

రేపు మండలానికి మంత్రులు ఉత్తమ్, పొంగులేటి రాక

పాలకవీడు: మండలంలో నిర్వహించే పలు అభివృద్ధి కార్యక్రమాలకు భారీ నీటిపారుదల శాఖా మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం హాజరవుతున్నట్లు బెట్టి తండా మాజీ సర్పంచ్ మోతీలాల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల చిరకాల వాంఛ అయిన మూసీ నది నుంచి బెట్టితండాకు రూ.33.83కోట్లతో నిర్మించనున్న లిఫ్ట్ పనులను మంత్రులు ప్రారంభిస్తారని తెలిపారు. ఈ లిఫ్ట్ ద్వారా మూడు గ్రామాల్లో సుమారు 2500ఎకరాలకు సాగు నీరం దనుందని తెలిపారు. మంత్రుల పర్యటనను విజయవంతం చేయాలని ఆయన మండల ప్రజలను కోరారు.

ఇఫ్కో డైరెక్టర్‌గా రఘుపతి ఎన్నిక

కోదాడ రూరల్, మార్చి 12: ఇఫ్కో డైరెక్టర్‌గా మండలంలోని చిమిర్యాల పీఏసీఎస్ చైర్మన్ కొత్త రఘుపతి ఎన్నికయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఇఫ్కో ప్రధాన కార్యాలయంలో ఎన్నికల అధికారి రాజగోపాలచారి ఆధ్వర్యంలో ఎన్నికను నిర్వహించారు. 14 ఓట్లకు రఘుపతికి ఎనిమిది ఓట్లు వచ్చాయి. దీంతో ఆయన డెరెక్టర్‌గా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రఘుపతి మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి, నాయకులు చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, ముత్తవరపు పాండురంగారావు, వంగవీటి రామారావు, నల్గొండ జిల్లా కాంగ్రెస్ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బాబు, హనుమయ్య, నలజాల శ్రీనివాసరావు, సూర్యం పాల్గొన్నారు.

భూదాన్ భూముల్లో నిర్మాణం చేపట్టిన పరిశ్రమలకు నోటీసులు

మేళ్లచెర్వు, మార్చి 12: మండల కేంద్రంలో భూదాన్ భూములను అక్రమించి నిర్మాణాలు చేపట్టిన పరిశ్రమల సంస్థలకు, వ్యక్తులకు భూదాన్ బోర్డు కార్యాలయం నోటీసులు జారీ చేసింది. మేళ్లచెర్వు రెవెన్యూ పరిధిలోని సర్వే నెం.1057లోని 113 ఎకరాల భూముల్లో అక్రమ కట్టడాలు నిర్మించుకున్నారనే ఆరోపణలతో ఈనెల 16న సీసీఎల్ కార్యాలయంలో హజరుకావాలని స్థానిక మైహోం పరిశ్రమ, కీర్తి పరిశ్రమతో పాటు ప్రైవేటు వ్యక్తులకు భూదాన్ బోర్డు కార్యాలయం నోటీసులు జారీ చేసినట్లు తహసీల్దార్ జ్యోతి తెలిపారు.

రెండు కార్లు ఢీ: యువకుడి మృతి



కిరణ్‌కుమార్ (ఫైల్ ఫొటో)

నాగారం మార్చి 12: రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. కారులో ఉన్న నలుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం మండలంలోని ఢీకొత్తపల్లి స్టేజీ సమీపంలో సూర్యాపేట-జనగాం జాతీయ రహదారి 365-బీపై సోమవారం రాత్రి జరిగింది. ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నాగారం గ్రామానికి చెందిన గూడెపు కిరణ్‌కుమార్(35) పెయింటింగ్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పర్సాయపల్లికి చెందిన తన స్నేహితుడు పంది సైదులు కారులో సోమవారం రాత్రి నాగారం నుంచి సూర్యాపేటకు బయలుదేరారు. అతివేగంగా కారు నడుపుతున్న సైదులు అదుపు తప్పి మండలంలోని డి.కొత్తపల్లి స్టేజీ సమీపంలో ఎదురుగా వస్తున్న మరో కారును ఢీకొట్లాడు. కారులో ఉన్న గూడెపు కిరణ్‌కుమార్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. రెండు కార్లలో ఉన్న నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి కిరణ్‌కుమార్‌తో పాటు గాయపడిన నలుగురిని చికిత్స కోసం సూర్యాపేట జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ కిరణ్‌కుమార్ మంగళవారం మధ్యాహ్నం మృతి చెందాడు. కిరణ్ కుమార్ భార్య గీత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి

కోదాడ రూరల్, మార్చి 12: విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని కాపుగల్లులో జరిగింది. రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఎలక్ట్రీషియన్ జానీమియా తన ఇంట్లో విద్యుత్ వైరు తెగగా, దానిని మరమ్మతు చేస్తూ విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయాడు. భార్య ఆయనను వెంటనేస్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందాడు. . భార్య రజియా బేగం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

పెన్‌పహాడ్, హుజూర్‌నగర్, మార్చి 12: పెన్‌పహాడ్, హుజూర్‌నగర్ మండలాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దూపహాడ్ గ్రామ సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు గాయపడ్డారు. నేరేడుచర్ల మండలం మేడారం గ్రామానికి చెందిన మామిడి నాగయ్య, కోల హుస్సేన్ బైక్‌పై సూర్యాపేటకు వెళ్లి తిరిగి మేడారం గ్రామానికి వస్తున్నారు. దూపహాడ్ గ్రామ శివారు మూల మలుపు వద్ద వరికోత మిషన్ రోడ్డు పక్కన ఆగి ఉంది. దానిని గమనించకుండా బైక్‌ను నడుపుతున్న నాగయ్య కోత మిషన్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో నాగయ్య తలకు గాయమైంది. హుస్సేన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. 108 ఈఎంటీ కృష్ణ, డ్రైవర్ శ్రీనివాస్ క్షతగాత్రులను సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించారు. నాగయ్య పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలించారు.

● హుజూర్‌నగర్ మండలంలోని శ్రీనివాసపురం గ్రామంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఎస్ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. లింగగిరి గ్రామానికి చెందిన నరాల లింగయ్య, జానీపాషా సెంట్రింగ్ పని ముగించుకుని ఇంటికి తిరిగి వస్తుండగా శ్రీనివాసపురం మూలమలుపు వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో గాయపడ్డారు. అదే రోడ్డులో ప్రయాణిస్తున్న కొంతమంది వీరిద్దరిని గుర్తించి 108కి సమాచారం అందించడంతో హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం ఇద్దరినీ సూర్యాపేటకు తరలించారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అందరి సహకారంతో జాతర విజయవంతం



మేళ్లచెర్వులో ఎడ్లుల పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పద్మావతి

మేళ్లచెర్వు, మార్చి 12: అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజల సహకారంతో మేళ్లచెర్వు శివాలయం మహాశివరాత్రి జాతర విజయవంతమైందని ఎమ్మెల్యే ఉత్తమ్‌పద్మావతిరెడ్డి అన్నారు. మంగళవారం జాతర ముగింపు సభలో మాట్లాడారు. ముందుగా కబడ్డీ పోటీలను, ఎడ్లుల పందేలను ఆమె ప్రారంభించి తిలకించారు. చాలాకాలం తర్వాత ప్రజా జాతర నిర్వహించామన్నారు. జాతరలో ఎడ్ల యజమానులు స్వచ్ఛందంగా పాల్గొన్నందుకు, జాతరను విజయవంతం చేసినవారందరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

ట్రాక్టర్‌ను గెలుచుకున్న తెలంగాణ గిత్తలు

మహా శివరాత్రి సందర్భంగా మంగళవారం నిర్వహించిన ఎడ్డుల సీనియర్ విభాగంలో నిర్వహించిన బండ లాగుడు పోటీలో మొత్తం 12 జతలు పోటీలో పాల్గొన్నాయి. తెలంగాణ నుంచి పాల్గొన్న ఏకైన జత హైదరాబాద్ ఎస్ఎస్ బుల్స్ సప్ప ఆసియాచౌదరికి చెందిన గిత్తలు 2630అడుగుల దూరాన్ని లాగి మొదటి బహుమతిగా ట్రాక్టర్‌ను గెలుచుకున్నాయి. కడప జిల్లాకు చెందిన చంద్ర ఓబుల్‌రెడ్డి జతలు ద్వితీయ బహుమతి బజాజ్ ద్విచక్ర వాహనాన్ని గెలుచుకున్నాయి.

● ఈ జాతర సందర్భంగా . సోమవారం రాత్రి నిర్వహించిన ఎడ్డుల జూనియర్ విభాగంలో నిర్వహించిన బండ లాగుడు పోటీల్లో 11జతల ఎడ్లు పాల్గొన్నాయి. కడప జిల్లా మైదుకూరుకు చెందిన కుర్ర వెంకటేష్ ఎడ్డులు 2861అడుగుల దూరం లాగి మొదటి బహుమతి మహేంద్ర టాక్టర్‌ను గెలుచుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన డి.రోషన్‌బాబు గిత్తలు 2800 అడగుల దూరాన్ని లాగి ద్వితీయ బహుమతిగా యమహా బైక్‌ను గెల్చుకున్నాయి.

● దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలుగు రాష్ట్రాల స్థాయి కబడ్డీ పోటీలు కొనసాగుతున్నాయి.

హుండీల లెక్కింపు

పెన్‌పహాడ్: మండలంలోని నాగులహాడ్ త్రికుటేశ్వరాలయం హుండీ కానులను లెక్కించినట్లు త్రికుటేశ్వరాలయం పునరుద్ధరణ కమిటీ ట్రస్టు అధ్యక్షుడు సంకరమద్ది రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శి తండు భిక్షం, కోశాధికారి సంకరమద్ది దామోదర్‌రెడ్డి తెలిపారు. ఈ నెల ఏడో తేదీ నుంచి 11 వరకు జరిగిన జాతరలో దేవుడి కల్యాణం సందర్భంగా హుండీ ఆదాయం రూ.13,356లు, సాధారణ హుండీ ఆదాయం రూ.13,200లు, దేవుడి దర్శనాల టిక్కెట్ల ద్వారా రూ 22 వేలు మొత్తం రూ.48,556లు ఆదాయం వచ్చినట్లు వారు తెలిపారు.

అర్వపల్లి: మండల కేంద్రంలోని శ్రీయోగనందలక్ష్మీనర్సింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ముగియడంతో మంగళవారం దేవాలయ ఆవరణలో అధికారులు హుండీలను లెక్కించారు. హుండీల ఆదాయం రూ.3.28లక్షలు వచ్చినట్లు దేవాలయ ఉత్సవ కమిటీ చైర్మన్ అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, ఈవో శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కనుకు రేణుక, అర్చకులు రాంబాబు పాల్గొన్నారు.

వైభవంగా వసంతోత్సవం

మేళ్లచెర్వు: మహా శివరాత్రిని పురస్కరించుకుని మేళ్లచెర్వులోని శివాలయ బ్రహ్మోత్సవాలు మంగళవారం ఐదో రోజుకు స్వామి, అమ్మవారి ఉత్సవ విగ్రహాలకు వసంతోత్సవం నిర్వహించారు. . పంచ రంగులతో అభిషేకాలు నిర్వహించి, శాస్త్రోక్తంగా పూజలు, పూర్ణాహుతిని వేద పండితులు నిర్వహించారు. వేకువజాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో దేవాలయంలో స్వామిని దర్శించుకుని అభిషేకాలు, ఇష్టకామేశ్వరి అమ్మవారికి, కుంకుమార్చనల్లో పాల్గొన్నారు. రాత్రి సమయంలో పవళింపు సేవ నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు విష్ణువర్ధన్ శర్మ, ధనుంజయశర్మ, రాధా కృష్ణమూర్తి, ఆలయ చైర్మన్ శంభిరెడ్డి, ఈవో కొండా రెడ్డి పాల్గొన్నారు.



మేళ్లచెరువులో వసంతోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

కరువు మండలంగా ప్రకటించాలి

ఆత్మకూర్(ఎస్), మార్చి 12: ఆత్మకూర్(ఎస్)ను కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ సబ్ డివిజన్ కార్యదర్శి కునుకుంట్ల సైదులు, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు పోరండ్ల దశరథ కోరారు. ఈ మేరకు మంగళవారం సీపీఐ (ఎంఎల్), న్యూడెమోక్రసీ, అఖిల భారత రైతు కూలి సంఘం ఆధ్వర్యంలో ఆత్మకూర్(ఎస్) తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. నీరులేక ఎండిపోయిన పైర్లకు ఎకరానికి రూ.30వేల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎస్సారెస్పీ ఆయకట్టు చివరి భూములకు సాగునీరు అందించాలని పండిన పంటకు రూ.500లు బోనస్ ఇవ్వాలన్నారు. పండించిన పంటకు మద్దతు ధర చట్టాన్ని పార్లమెంటులో ఆమోదించాలన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్ఐ అంజయ్యకు అందజేశారు.కార్యక్రమంలో నాయకులు డేగల వెంకట కృష్ణ, కొండేటి సంజీవరెడ్డి, బొల్లె వెంకన్న, సామా నర్సిరెడ్డి, కంచర్ల నర్సక్క, సీతారాంరెడ్డి, మాచిరెడ్డి వీరారెడ్డి, పాల్గొన్నారు.

కబడ్డీ క్రీడాకారుల ఎంపిక కార్యక్రమం ప్రారంభం

కోదాడ రూరల్, మార్చి 12: మండలంలోని కొమరబండ తేజ విద్యాలయంలో కీర్తి (ఖేలో ఇండియా రైసింగ్ టాలెంట్ ఐడెంటిపికేషన్) కబడ్డీ క్రీడాకారుల ఎంపిక కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రమాసోమిరెడ్డి మాట్లాడుతూ కేంద్ర యువజన, కీడ్రల మంత్రిత్వ శాఖ, భారత క్రీడా సాధికార సంస్థ (స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా) సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో 'కీర్తి' కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. బెంగుళూరు రీజియన్‌లో మొదటగా రాష్ట్రంలో కోదాడలోని తేజ విద్యాలయంలో ప్రారంభమైందన్నారు. ఈ కార్యక్రమం బుధవారం కూడా కొనసాగుతుందని తెలిపారు. ఎంపికలో వివిధ పాఠశాలల 206 మంది చిన్నారులు పాల్గొన్నారని తెలిపారు. చిన్నారుల్లో ఉన్న శారీరక ధృఢత్వం, వేగం, ఆటలో ఖచ్చితత్వం, మెళకువలు తదితర 14 అంశాల ఆధారంగా విద్యార్థులకు పాయింట్లు కేటాయించి ఎంపిక చేస్తారన్నారు. ఎస్ఏఐకి చెందిన రాష్ట్ర స్థాయి కబడ్డీ కోచ్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ ఎంపిక జరుగుతుందన్నారు. ఆసక్తి ఉన్న చిన్నారులు పాల్గొనవచ్చని తెలిపారు. మొదటిరోజు ఈ ఎంపిక కార్యక్రమాన్ని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి ప్రారంభించారు.

'మనువాద పునరుద్ధరణ కుట్రలను తిప్పికొట్టాలి'

భానుపురి, మార్చి 12: కేంద్రం ప్రభుత్వం మనువాద పునరుద్ధరణకు యత్నిస్తోందని, ఆ కుట్రలను తిప్పికొట్టాలని పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు స్వరూప పిలుపునిచ్చారు. అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవంలో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని కుడకుడలో ప్రగతిశీల మహిళా సంఘం(పీఓడబ్ల్యూ) ఆధ్వర్యంలో జిల్లా ఉపాధ్యక్షురాలు సూరం రేణుక అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మహిళలకు సమాన వేతనాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక, అధ్యక్షులు చంద్రకళ, జిల్లా కమిటీ సభ్యులు కారింగుల వెంకన్న, పేర్ల నాగయ్య, ఎర్ర అఖిల్‌కుమార్, జయమ్మ, కవిత, మంగమ్మ, పద్మ, రమణ, గౌరమ్మ, లక్ష్మీ, శారద, రాధ, బాజి, కృష్ణవేణి, అనసూర్య తదితరులు ఉన్నారు.

గౌరవ వేతనం, పింఛను సౌకర్యం కల్పించాలి

సూర్యాపేట సిటీ, మార్చి 12: రాష్ట్రంలోని స్థానిక సంస్థల్లో పనిచేసిన జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కో-ఆప్షన్ సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం గౌరవ వేతనం, పింఛను సౌకర్యం కల్పించాలని మండల పరిషత్ కోఆప్షన్ ఫోరం జిల్లా అధ్యక్షుడు అబ్బాస్ అలీ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్ర ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను అమలుచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, ప్రజాప్రతినిధులుగా పనిచేసిన వారికి గౌరవ వేతనాలను మంజూరు చేసి సముచిత స్థానం కల్పించాలని కోరారు.

మంత్రి సహకారంతో గ్రామం అభివృద్ధి

మఠంపల్లి, మార్చి 12: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో గ్రామం అభివృద్ధికి కృషి చేస్తున్నామని కాంగ్రెస్ పార్టీ బక్కమంతుల గూడెం గ్రామ అధ్యక్షుడు సోమిరెడ్డి గోవిందరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ గోలి చంద్రం అన్నారు.మంగళవారం మండలంలోని బక్కమంతుల గూడెంలో 'ఉపాధి' నిధులు రూ.5లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు సోమిరెడ్డి గోవిందరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ గోలి చంద్రం, గంగాసాని ఎల్లారెడ్డి, రాజమోహన్‌రెడ్డి, తిరపతయ్య, నాగిరెడ్డి, లింగారెడ్డి, పిచ్చయ్య, సైదులు, జానమ్మ, గురవయ్య, అంజి, నాగిరెడ్డి, సైదాహుస్సేన్, మాబు, టి.వెంకటరెడ్డి, వీరారెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

చిలుకూరు, మార్చి 12: మండలంలోని పోలేనిగూడెం గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే పద్మావతి సమక్షంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో వాస్తురేఖ నాగేశ్వరరావు, చిట్టేటి వెంకటేశ్వర్లు, జయరాజు, పనస గోపి, నాగార్జున, శ్రీకాంత్, వెంకటేశ్వర్లు ఉన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బజ్జూరి వెంకట్‌రెడ్డి, రెమిడాల ఆనందరావు, మండవ గురునాథం, బిట్టు రామకృష్ణ, చందా వెంకటేశ్వర్లు, నర్సయ్య, కొండలు పాల్గొన్నారు.

మఠంపల్లి: మండలంలోని చెన్నాయిపాలెం గ్రామంలో బీఆర్ఎస్‌కు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్యమంజూనాయక్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

'కాంగ్రెస్ విజయమే లక్ష్యంగా పనిచేయాలి'

నూతన్‌కల్, మార్చి 12: వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వసుల అశోక్‌యాదవ్ కోరారు. మండంలోని టీక్యాతండ గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా లావుడ్యా చిరంజీవిని నాయక్‌ను నియమించారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో చిరంజీవినాయక్‌కు నియామకపత్రం అందజేసి మాట్లాడారు. సమావేశంలో నాయకులు లావుడ్యా శ్రీధర్‌నాయక్, దస్రూ నాయక్, మోహన్‌నాయక్, దేవేందర్, సికిందర్, మహేష్, గంగయ్య, నవీన్, పవన్, చిరు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే సైదిరెడ్డి ప్లెక్సీల తొలగింపు

నేరేడుచర్ల, మార్చి 12: హుజూర్‌నగర్ మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి బీజేపీలో చేరడంతో పట్టణంలో ఉన్న ఆయన ప్లెక్సీలను బీఆర్ఎస్ కార్యకర్తలు మంగళవారం తొలగించారు. ఇటీవల సైదిరెడ్డి పార్టీ మారడంతో బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు ఆయనపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌ను నట్టేట ముంచి వెళ్లాడంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డీఎస్సీ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

సూర్యాపేట(కలెక్టరేట్), మార్చి 12: డీఎస్సీకి సన్నద్ధమయ్యే అభ్యర్థుల కోసం జిల్లా కేంద్రంలోని ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ, వసతి కోసం అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్, ఎస్సీ కులాల జిల్లా అభివృద్ధి అధికారి కె.లత మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. డైట్, బీఈడీ ఉత్తీర్ణత సాధించి, టెట్ అర్హత సాధించిన అభ్యర్థులు శిక్షణకు అర్హులన్నారు. అర్హత కలిగిన ఎస్సీ కులాల అభ్యర్థులు ఈనెల 26వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులకు ఏప్రిల్ 15వ తేదీ నుంచి జూన్ 14వ తేదీ వరకు రెండు నెలల పాటు శిక్షణ ఉంటుందన్నారు.

వనిత క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

నేరేడుచర్ల, మార్చి 12: నేరేడుచర్ల వనితాక్లబ్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం పట్టణంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా గెల్లి లక్ష్మీప్రసన్న, ప్రధాన కార్యదర్శిగా చెరుకు కవిత, కోశాధికారిగా గరిణె జ్యోతిని ఎన్నుకున్నట్లు వాసవి క్లబ్ వైస్ గవర్నర్ రాచకొండ విజయలక్ష్మి తెలిపారు. నూతన కార్యవర్గాన్ని ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ గరిణె అరుణ, రాచకొండ శ్రీనివాసరావు, కందిబండ వాసంతి, కొత్త లక్ష్మణ్, వీరవల్లి శ్రీలత అభినందించారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

పెన్‌పహాడ్, మార్చి 12: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్‌సీ హెచ్‌ఈవో, గ్రామ ప్రత్యేకాధికారి డాక్టర్ చంద్రశేఖరరాజు అన్నారు. మంగళవారం మండలంలోని నాగులపహాడ్ గ్రామ పంచాయతీ పరిధిలోని దుబ్బగూడెంలో 'ఉపాధి' నిధులు రూ.5లక్షలతో నిర్మించనున్న మురుగు కాల్వ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. నిర్మాణ పనులను నాణ్యతతో చేపట్టాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దివ్యభారతి, ఒగ్గు దేవయ్య రేణుక, సంకరమద్ది సుదర్శన్‌రెడ్డి, జగ్గారెడ్డి, పుల్లారెడ్డి, శేఖర్‌రెడ్డి, రాంరెడ్డి, వెంకట్‌రెడ్డి, గోవర్ధన్, సందీప్, అంజయ్య, కృష్ణయ్య, వరలక్ష్మి, లలిత, పార్వతమ్మ, సుజాత పాల్గొన్నారు.

అభివృద్ధిలో ప్రజలు భాగస్వామ్యం కావాలి

హుజూర్‌నగర్, మార్చి 12: హుజూర్‌నగర్ అభివృద్ధిలో ప్రజలు భాగస్వామ్యం కావాలని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్‌రావు కోరారు. మంగళవారం పట్టణంలోని 15వ వార్డులో రూ.4లక్షలతో నిర్మిస్తున్న సీసీ, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పని చేస్తుందన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో హుజూర్‌నగర్‌లో అనేక ప్రగతి పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో చిట్యాల అమర్‌నాథ్‌రెడ్డి, లచ్చిమళ్ళ నాగేశ్వరరావు, ముశం సత్యనారాయణ, రామ్మూర్తి, డేవిడ్, దగ్గుపాటి బాబూరావు, హరీష్, గల్లా వెంకటేశ్వర్లు, విజయకుమారి, రామిరెడ్డి, యోహాన్ పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నాం: ఎంపీపీ

హుజూర్‌నగర్, మార్చి 12: గ్రామాల్లో ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తున్నామని ఎంపీపీ గూడెపు శ్రీనివాసు తెలిపారు. మంగళవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆధునీకీకరణ పనులకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహాయ, సహకారాలతో అనేక ప్రగతి పనులు చేపట్టినట్లు తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ప్రతినిధులను నిర్లక్ష్యం చేసిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో లావణ్య, అరుణ్‌కుమార్, దొంగరి సత్యనారాయణ, వల్లభనేని విజలయలక్ష్మి, కాశమ్మ, నర్సిరెడ్డి పాల్గొన్నారు.

పట్టణాల్లోని కూలీలకు 'ఉపాధి' పనులు కల్పించాలి

హుజూర్‌నగర్, మార్చి 12: పట్టణాల్లోని వ్యవసాయ కూలీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'ఉపాధి' పనులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ముల్కలపల్లి రాములు కోరారు. మంగళవారం పట్టణంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా స్థాయి వర్క్‌షాపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో ఎంతోమంది పనులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పేదలకు పని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. 'ఉపాధి' చట్టాన్ని నిర్వీర్యం చేస్తే సహించేదిలేదన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మట్టిపల్లి సైదులు, వెంకటేశ్వర్లు, రామకృష్ణారెడ్డి, ఎలక సోమయ్య గౌడ్, హర్యానాయక్, రమేష్, బిక్షం, వెంకన్న, శ్రీను, వెంకట్ పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలపై పోరాడతాం

భానుపురి, మార్చి 12: విద్యార్థుల సమస్యల పరిష్కారానికి సైనికుల్లా పోరాటం చేస్తామని తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు భారీ అశోక్‌యాదవ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడారు. టీఎస్‌పీ జిల్లా, నియోజకవర్గ కమిటీలు, మండల స్థాయి కమిటీలను ఏర్పాటు చేసి విద్యార్థుల సమస్యలపై పోరాడుతామన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని, నిరుద్యోగభృతి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడిగా వర్రె అంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా భోనగిరి మహేష్‌ను నియమించారు. కార్యక్రమంలో ఉదయ్, నవీన్, శ్రావణ్, నాగరాజు, శేఖర్, సందీప్, భరత్, సూర్య, పరశురాం పాల్గొన్నారు.



సూర్యాపేట రూరల్: మండలంలోని ఇమాంపేట గ్రామ మాజీ సర్పంచ్ పాముల ఉపేందర్ మాతృమూర్తి సైదమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు, ఆమె కుటుంబాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి పరామర్శించి, సైదమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాలర్పించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ జీడీ భిక్షం, ఎంపీటీసీ కిరణ్, శ్రీనివాస్‌రెడ్డి, పుల్లారెడ్డి, అంజయ్య పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: పట్టణంలోని ఉస్మానియా మసీదులో మౌలిక వసతులు కల్పించాలని ముస్లిం మైనార్టీ నాయకుడు మన్సూర్‌అలీ కోరారు. మంగళవారం పట్టణంలోని మసీదులో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మసీదుకు అభివృద్ధి కమిటీని వేయాలన్నారు. బాధ్యత గల వ్యక్తులు లేకపోవడంతో మసీదు నిర్వహణ అస్తవ్యస్థంగా మారిందన్నారు. అధికారులు తక్షణమే మసీదుకు కమిటీ వేసి రంజాన్ సందర్భంగా సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో అబ్దుల్ రహీమ్, ఇబ్రహిం, షఫీ, మజీద్ పాల్గొన్నారు.

మఠంపల్లి: మండలంలోని మట్టపల్లి క్షేత్రంలో మంగళవారం శ్రీలక్ష్మీనృసింహుని నిత్య కల్యాణాన్ని మంగళవారం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మట్టపల్లిరావు పాల్గొన్నారు.

కోదాడ టౌన్: పట్టణంలోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయం ప్రాంగణంలో ఉన్న కొలువై ఉన్నఅభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో జూకూరి అంజయ్య, కోట తిరుపతయ్య పాల్గొన్నారు.

● ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని కోదాడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ వెంకటేశ్వర్లు అన్నారు. కోదాడలో ఆటో డ్రైవర్లకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతి ఆటో డ్రైవర్ యూనిఫాం ధరించాలన్నారు.కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ బాల్సు శ్రీనివాస్ పాల్గొన్నారు.

కోదాడ రూరల్: ఆర్టీసీ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం 2017 పేస్కేల్‌ను 21 శాతానికి పెంచడంపై స్థానిక డిపో మేనేజర్ శ్రీహర్ష ఉద్యోగులకు స్వీట్లు పంచారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ బి.సైదులు, ఎంఎఫ్ రాజేష్, డిపో సిబ్బంది పాల్గొన్నారు.

మునగాల రూరల్: ప్రతిరైతు తమ కుటుంబ ఆరోగ్య అవసరాల కోసం అర ఎకరంలో ప్రకృతి వ్యవసాయం చేపట్టాలని సిరి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మొలుగూరి గోపి కోరారు. మండలంలోని ఆకుపాముల గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

మద్దిరాల: విద్యార్థులు బాగా చదివి నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు సుల్తాన్ నరేష్ అన్నారు. మంగళవారం మండలంలోని గోరెంట్ల గ్రామ జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు పెన్నులు, పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాస్, తాళ్లపల్లి సురేష్ సాగర్, వెంకటేష్ పాల్గొన్నారు.

నూతన్‌కల్: మండలంలోని అలుగునూరు గ్రామానికి చెందిన రిటైర్డు హెచ్‌ఎం, కాంగ్రెస్ పార్టీ నాయకుడు పట్టేటి చంద్రయ్య మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని ఆ పార్టీ మండల అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం అనారోగ్యంతో మృతి చెందిన చంద్రయ్య మృతదేహానికి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో మెంచు చక్రయ్య, దరిపెల్లి వీరన్న, ఇరుగు కిరణ్, మరాఠి రామస్వామి, గునగంటి వెంకన్న, యామగాని రమేష్, బంటు క్రాంతి, బంటు భద్రి, పాల్గొన్నారు.

పాలకవీడు, నాగారం: తెలంగాణ ప్రభుత్వం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన స్వయం సహాయక సంఘాల సభ్యుల సభకు పాలకవీడు, నాగారం మండలాల నుంచి మహిళలు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. తరలివెళ్లిన వారిలో ఏపీఎం శోభ, వీబీకేలు రాణి, రేణుక, నాగమ్మ, మహిళా సంఘాల సభ్యులు ఉన్నారు.